క్లుప్తంగా

మా గోడు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టదా?



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

రేణిగుంట: తమ గోడు ప్రభుత్వానికి పట్టదా? అని రేణిగుంట మండల సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రేణిగుంట మండలంలోని సచివాలయ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి, ఎంపీడీఓ రవిచంద్రకు వినతి పత్రం అందజేశారు.

వలంటీర్ పనులు అప్పగించొద్దు



ఎంపీడీఓ సౌభాగ్యానికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఏర్పేడు: తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సర్వీసులు అందజేసే వలంటీర్ పనులను తమ చేత చేయించవద్దని మండల సచివాలయ ఉద్యోగులు కోరారు. ఏర్పేడు మండల సచివాలయ ఉద్యోగులు బుధవారం ఎంపీడీఓ డాక్టర్ సౌభాగ్యం, తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

ఘనంగా స్వచ్ఛతా హీ సేవ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రి వద్ద స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, పురపాలక కమిషనర్ భవానీ ప్రసాద్, ఎంజీఎం డైరెక్టర్ గుడ్లూరు మయూర్ హాజరయ్యారు. ఎంజీఎం ఆస్పత్రి వద్ద నిర్వహించిన వైద్యశిబిరంలో సుమారు 150 మంది పురపాలక సంఘ పారిశుద్ధ్య కార్మికులకు పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డులో ఉన్న అంకాలమ్మ ఆలయం వద్ద బుధవారం దసరా సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్‌రావు, సత్యనారాయణరావు, జయగణేష్, మురళిజాదవ్, శివప్రసాద్, హరహరకుమార్, నాగేంద్ర, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వరదయ్యపాళెం: సత్యవేడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సత్యవేడు ఐసీడీఎస్ సీడీపీఓ దేవకుమారి తెలిపారు. పదో తరగతి పాసై, ఆసక్తి గల వారు ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ అంగన్‌వాడీ సెంటర్‌కు జనరల్ కేటగిరీకి చెందిన కార్యకర్త పోస్టు, అలాగే తొండంబట్టు, పాండూరు, వరదయ్యపాళెం దళితవాడ, సత్యవేడు మండలం పాలగుంట కేంద్రాలకు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

విద్యుత్ శాఖాధికారుల దౌర్జన్యం

తొట్టంబేడు: మండలంలోని బోనుపల్లిలో తొట్టంబేడు విద్యుత్ శాఖ అధికారులు 11 కేవీ విద్యుత్ లైన్లు లాగుతున్నారు. ఆ గ్రామ రైతులు రోడ్డు పక్కన లైన్లు లాక్కోమని చెప్పినా వినకుండా దౌర్జన్యంగా బీసీ రైతుల పొలాలు మధ్య లైన్లు లాగుతున్నారు. తెలుగుదేశం నాయకుడు డి.రామానాయుడు మాట విని విద్యుత్ శాఖాధికారులు ఈ పని చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఏఈ, ఏడీఈలను ఫోన్‌లో సంప్రదించగా విద్యుత్ శాఖాధికారులు బోనుపల్లి రామానాయుడు చెప్పిన విధంగా తాము లైన్లు లాగుతామని, మీ వల్ల అయింది చేసుకోమని బెదిరించారు. కొంతమంది రైతులపై కేసులు పెట్టా రు. ఈ అరాచకాలు, దౌర్జన్యాలను తట్టుకోలేక బీసీ రైతులు ఆత్మహత్యలకు సిద్ధపడుతున్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని బుధవారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, ఏపీ హౌసింగ్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయాధికారులు వారికి దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

చదువులమ్మగుడి.. తడబడి

ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మార్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన మన బడి నాడు–నేడు కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కగానే మంగళం పాడింది. గత ఏడాదిన్నర కాలం నుంచి పాఠశాలల్లో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ఆగిన నాడు–నేడు పనులు
- అసంపూర్తిగా భవనాలు

వరదయ్యపాళెం: ప్రభుత్వ పాఠశాలలు కూటమి పాలనలో కునారిల్లుతున్నాయి. సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో పలు సర్కారు పాఠశాలలు సమస్యల సుడిగుండంలో కూరుకుపోయి కొట్టుమిట్టాడుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మన బడి నాడు–నేడు కార్యక్రమం అమలుకు ముందు తలుపులు లేని గదులు, విరిగిన కిటికీలు, రంగు వెలసిన బోర్డులు, విరిగిన బెంచీలు దర్శనమిచ్చేవి. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు బడులు, విద్యను పటిష్టం చేయడానికి పలు పథకాలు అమల చేశారు. నాడు–నేడు ద్వారా నియోజకవర్గంలోని 333 పాఠశాలల్లో రూ.38.23 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి ఆధునీకరించారు. అయితే కొన్నిచోట్ల పనులు జరుగుతున్న సమయంలో సార్వత్రిక ఎన్నికల కారణంగా పనులు ఆగిపోయాయి. 60 నుంచి 80శాతం మేర పూర్తయిన ఆ పనులను కూటమి సర్కారు గద్దెనెక్కగానే ఆపివేసింది. దీంతో అసంపూర్తి భవనాలు దర్శనమిస్తున్నాయి. ఆ భవనాలు శిథిలావస్థకు చేరుకుంటుండడంతో రూ.కోట్ల ప్రజాధనం వృథా అవుతున్నా కూటమి సర్కారు ఆ పనుల గురించి ఆలోచించకపోవడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.



కేవీబీపురంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఆగిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు



అరుదూరులో ఆగిపోయిన నాడు–నేడు అదనపు తరగతి గది



బీఎన్ కండ్రిగ హైస్కూల్‌లో ఆగిపోయిన అదనపు గదుల నిర్మాణం

• నివాళి

రేణిగుంట: మండలంలోని గురవరాజుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ రహీం తండ్రి సత్తార్ సాహెబ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి బుధవారం ఆ గ్రామానికి చేరుకుని సత్తార్ సాహెబ్ భౌతికాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు తిరుమల రెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, శంకర్ రెడ్డి, ప్రకాష్, శీను, రహంతుల్లా, నాగూరయ్య, యోగేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి, మునిరెడ్డి, గిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

ఎంపీ, మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం అమ్మపాళేనికి చెందిన అడ్వకేట్ మునిశేఖర్‌రెడ్డి అనారోగ్యంతో రేణిగుంట సమీపంలోని అమర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం విషయం తెలుసుకున్న తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. వారి వెంట రేణిగుంట పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, తూకివాకం సర్పంచ్ మునిశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

ఎంపీ మిథున్‌రెడ్డితో షేక్ సిరాజ్‌బాషా భేటీ

శ్రీకాళహస్తి: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని బుధవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ బాషా కలిశారు. ఆయన్ని ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించారు.



రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డితో షేక్ సిరాజ్‌బాషా

పట్టాలు ఇవ్వాలని వినతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కుక్కంబాకంలోని దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని బుధవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి సీపీఎం మండల నాయకులు నలుగూరి రమణయ్య, బాలగురవయ్య, దళితులతో కలసి విజ్ఞప్తి చేశారు. పెద్దపాలేడు గ్రామానికి పింఛన్ల పంపిణీకి వచ్చిన ఎమ్మెల్యేకు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగకరం

వరదయ్యపాళెం: వ్యవసాయ రంగంలో రైతులకు వినియోగించే యంత్రాలు, ఇతర పనిముట్లపై జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఎంతో ఉపయోగకరమని ఏఓ గౌరి తెలిపారు. వరదయ్యపాళెంలో రైతులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయమ్మ, జీఎస్టీ అధికారి దశరథన్, ఏఈఓలు ప్రవీణ్, కవిత, రైతులు పాల్గొన్నారు.



వరదయ్యపాళెంలో..

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

నాగలాపురం: మండలంలోని చిన్నాపట్టు వద్ద అరణియార్ నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. మండలంలోని చిన్నాపట్టు వద్ద అరణియార్ నదిలో బుధవారం వేకువజామున 4 గంటలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని స్థానికులు 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే ఎస్‌ఐ సునీల్ తన సి బ్బందితో ఇసుక అక్రమ రవాణాదారులపై మెరుపు దాడి చేసి, మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి, యాజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సునీల్ తెలిపారు.

దశదిశలా సంబరాలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో బుధవారం శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు కనువిందు చేశారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల వద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

–సాక్షినెట్‌వర్క్



సత్యవేడు: మహిషాసుర మర్దినిగా సర్వమంగళదేవి, నారాయణవనం: అవనాక్షమ్మ, మూలస్థాన ఎల్లమ్మ, కామాక్షాంబిక



శ్రీకాళహస్తి: మహిషాసుర మర్ధినిగా కనకదుర్గమ్మ, నల్లగంగమ్మ, వేదాం దక్షిణ కాళికాదేవి, పొన్నాలమ్మ, బీపీఅగ్రహారం చిన్నగంగమ్మ, పెద్దగంగమ్మ



ఏర్పేడు: పాపానాయుడుపేటలో హోమపూజలు, రేణిగుంట: బొమ్మలకొలువులో భక్తులు, మహిషాసుర మర్ధినిగా చాముండేశ్వరి, ప్రత్యేక అలంకరణలో కలుగూరమ్మ, విశేష అలంకరణలో పార్వతీదేవి, వజ్రకవచ అలంకరణలో కలుగూరమ్మ, సుమంగళిదేవిగా కన్యకాపరమేశ్వరి

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

బుచ్చినాయుడుకండ్రిగ: క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉండడానికి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ ఆవిష్కరించారని ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. బుధవారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మణినాయుడు ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అరాచక పాలనకు చెక్ పెట్టేందుకు డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారని, పార్టీ శ్రేణులపై జరిగే దాడులను మొబైల్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వాటికి పరిష్కారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి సాయినాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం, ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, జిల్లా నాయకులు జొన్నల గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, బాబురెడ్డి, అజయ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గురవయ్య, ప్రసాద్ పాల్, సముద్రాల అశోక్, జయచంద్రనాయుడు, వేంకటేశ్వర్లు, నాగూర్, అమరలింగయ్య, కిరణ్‌యాదవ్, రాజశేఖర్, దేవదాసురెడ్డి, పెంచలయ్య, శ్రీనివాసులురెడ్డి, బాబుశెట్టి, హేమంత్, కారణి వేంకటేష్, కత్తి సురేష్, ప్రసాద్, రాజశేఖర్, పరంథామయ్య, మంగయ్య, అశోక్, హరికృష్ణ, యాకోబు, మధు, జగన్, చెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నూకతోటి రాజేష్

జీఎస్టీపై అవగాహన ర్యాలీ



బుచ్చినాయుడుకండ్రిగ: ర్యాలీ చేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం, ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ స్వరాజ్యలక్ష్మి, ఏఈఓ హరిబాబ నాయక్, అధికారులు శ్రీనివాసులు, శ్యామ్, పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగలో బుధవారం వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ తగ్గింపుపై ఏఓ షణ్ముగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, ఎఈఓ రేవతి, రవినాయుడు, ఉషారాణి పాల్గొన్నారు.



ఏర్పేడు: ర్యాలీ చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

రైతులకు ఎంతో మేలు

ఏర్పేడు: వ్యవసాయ పరికరాలపై కేంద్రం 12శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించడం రైతులకు ఎంతో మేలు చేకూరుస్తుందని శ్రీకాళహస్తి స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.రేణుక అన్నారు. మండలంలోని వికృతమాల సచివాలయ పరిధిలో బుధవారం సూపర్ జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ డాక్టర్ సౌభాగ్యం, ఏఓ సాగరిక, పూల హేమాక్షి రాయల్ తదితరులు పాల్గొన్నారు.